తాగునీటి సమస్య రానివ్వం..


హఫీజ్‌పేట్ 17వ డివిజన్ జలమండలి కార్యాలయం

- మెరుగైన నీటి సరఫరా లక్ష్యంగా ముందుకు..
- కాలనీలు, బస్తీలకు చేరువయ్యేందుకు కొత్తగా రెండు డివిజన్లు
- ప్రతిరోజూ 40 మంచినీటి ట్యాంకర్లు బుక్
- హఫీజ్‌పేట్ జలమండలి జీఎం నారాయణ

చందానగర్ : 'ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా మెరుగైన నీటి సరఫరాకు కాలనీలు, బస్తీల్లో నూతన పైప్‌లైన్లు వేశాం. పాలనాపరమైన సమస్యల పరిష్కారంతో పాటు కాలనీలు, బస్తీలకు మరింత చేరువగా ఉండేందుకు కొత్తగా రెండు డివిజన్లుగా విభజించాం' అంటున్న హఫీజ్‌పేట్ 17వ డివిజన్ జనరల్ మేనేజర్ నారాయణతో సాక్షి ఇంటర్వ్యూ...

ప్రశ్న : హఫీజ్‌పేట్ డివిజన్‌లో ఎన్ని తాగునీటి కనెక్షన్లు ఉన్నాయి ?

జ : హఫీజ్‌పేట్ 17వ డివిజన్‌లో మొత్తం 42,279 మంచినీటి కనెక్షన్లు. ఇందులో కమర్షియల్ 1470 ఉన్నాయి.

ప్రశ్న : ఎన్ని రిజర్వాయర్లు ఉన్నాయి.. వాటి సామర్థ్యం ?

జ : 17వ డివిజన్ పరిధిలో 18 రిజర్వాయర్లు ఉన్నాయి. వాటి సామర్థ్యం 48.5 ఎంఎల్, వీటిలో అత్యధికంగా 21.80 ఎంఎల్ సామర్థ్యం పటాన్‌చెరు సెక్షన్లలో ఉండగా, అత్యల్పంగా 0.90 ఎంఎల్ సామర్థ్యం హఫీజ్‌పేట్ సెక్షన్‌లో ఉన్నాయి.

ప్రశ్న : నల్లా అక్రమ కనెక్షన్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ : నల్లా అక్రమ కనెక్షన్లపై ప్రత్యేక విజిలెన్స్ బృందాలను ఏర్పాటు చేశారు. ఆ కనెక్షన్లను గుర్తించి చర్యలు తీసుకుంటాయి. ఇప్పటి వరకు 6 కనెక్షన్లు పట్టుకున్నారు. వారిపై పోలీసు కేసులు నమోదు చేశాం.

ప్రశ్న : రోజూ ఎన్ని మంచినీటి ట్యాంకర్లు బుక్ అవుతున్నాయి ?

జ : హఫీజ్‌పేట్ డివిజన్‌లో రోజుకు 40 నీటి ట్యాంకర్లు బుక్ అవుతున్నాయి. గతంలో నీటి ఎద్దడితో ట్యాంకర్ల సమస్య ఉండేది. నూతన డివిజన్‌గా ఏర్పడిన తర్వాత ట్యాంకర్ల సమస్య పరిష్కరించాం.

ప్రశ్న : నీటి సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు ?

జ : ప్రైవేట్ బోర్లలో నీరు తగ్గినప్పుడు ట్యాంకర్ల బుకింగ్‌లు ఎక్కువగా వస్తున్నాయి. దానికి అనుగుణంగా వాటర్ ఫిల్లింగ్ స్టేషన్లు పెంచుతున్నాం. కొన్ని ప్రాంతాలలో సరఫరా ఆలస్యం కాకుండా చేస్తున్నాం. ప్రజలు కూడా అధికారులకు సహకరించాలి.

ప్రశ్న : డివిజన్‌లో సమస్య ఉన్న ప్రాంతాలు ఏవి ?

జ : హఫీజ్‌పేట్ డివిజన్‌లో ముఖ్యంగా గోకుల్ ప్లాట్స్, మాతృశ్రీనగర్, హఫీజ్‌పేట్, చందానగర్‌లలో సమస్య ఉంది. రోజు 120 నీటి ట్యాంకర్లు బుకింగ్ వస్తున్నాయి.

ప్రశ్న : శీతాకాలం ఇలా ఉంటే.. ఇక వేసవిలో తాగునీటి సమస్య వస్తే ఎలా అధిగమిస్తారు ?

జ : వేసవికాలంను దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఇబ్బందులు ఏర్పడకుండా ప్రణాళికలు రూపొందించాం. ప్రతిరోజు 400 వరకు నీటి ట్యాంకర్ల బుకింగ్ వస్తుందని అంచనా. వాటికి అనుగుణంగా 49 నీటి ట్యాంకర్లను అందుబాటులో ఉంచాం.

ప్రశ్న : హఫీజ్‌పేట్ 17వ డివిజన్ పరిధిలో సరిపడా నీటి సరఫరా జరగడం లేదంటున్నారు.. తీసుకుంటున్న చర్యలు..?

జ : డివిజన్ పరిధిలో ప్రతి కాలనీ, బస్తీలకు మంచి నీటి పైప్‌లైన్లు దాదాపు పూర్తి చేశాం. కానీ గోకుల్ ప్లాట్స్, మాతృశ్రీనగర్, హఫీజ్‌పేట్ ప్రాంతాలలో భారీ భవనాలు నిర్మించడం వల్ల పైప్‌లైన్ ద్వారా వచ్చే నీరు సరిపోవడం లేదు. వారు విడిగా వాటర్ ట్యాంకర్లు బుక్ చేసుకుంటున్నారు. అలాంటి ప్రాంతాలకు ప్రత్యేకంగా నీటి ట్యాంకర్లను సిద్ధం చేశాం.

హఫీజ్‌పేట్ 17వ డివిజన్ జీఎం నారాయణ : 9989988615

మియాపూర్ సబ్ డివిజన్..

వెంకటేశ్వర్లు డీజీఎం (మియాపూర్) మేనేజర్ (హఫీజ్‌పేట్) : 9989997518

సునీత (మేనేజర్, మియాపూర్) : 9154867431

ఎస్‌వీఎస్ సుబ్రమణ్యం రాజు (మేనేజర్, చందానగర్) : 9989989045

బిక్కులాల్ (మేనేజర్, దీప్తిశ్రీనగర్) : 7995010492

ఆర్సీపురం సబ్ డివిజన్ ..

శివ కృష్ణ (డీజీఎం/మేనేజర్, పటాన్‌చెరు) : 7337350848

అభిషేక్ (ఇన్‌చార్జ్ మేనేజర్, ఆర్సీపురం) : 9154867438

మంచినీటి ట్యాంకర్ కోసం : 155313

భక్షికుంట అభివృద్ధికి వినతి

శేరిలింగంపల్లి: చందానగర్ భక్షికుంట అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని గురువారం జోనల్ కమిషనర్‌ను బీజేపీ నాయకులు కోరారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొంతమేర అభివృద్ధి చేశారని, దీంతో పరిసర కాలనీల వాసులు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేస్తున్నారని తెలిపారు. కాగా ఈ సీజన్‌లో కురిసిన వర్షాలకు చెరువు నిండింది. దీంతో వాకింగ్ వచ్చే మహిళలు, చిన్నపిల్లలు అటు వెళ్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని, పాముల బెడద ఉందని వివరించారు. భక్షికుంట చెరువు చుట్టూ ఫెన్సింగ్, స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పోరెడ్డి బుచ్చిరెడ్డి, చందానగర్ డివిజన్ అధ్యక్షులు గొల్లపల్లి రాంరెడ్డి, నాయకులు మన్నె దత్తు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


డీసీ ముకుందరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు బుచ్చిరెడ్డి తదితరులు

'మనూ' అసిస్టెంట్ ప్రొఫెసర్ సబాఖాతూన్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ సబాఖాతూన్‌కు గురువారం పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. ఆంగ్ల విభాగంలో ప్రొఫెసర్ కొత్తచెరువు నాగేంద్ర పర్యవేక్షణలో 'ఇంటిగ్రేషన్ ఆఫ్ ఐసీటీ ఇన్ ఇంగ్లిష్ టీచింగ్ ప్రాక్టీస్ :యాన్ అసెస్‌మెంట్ ఆఫ్ ఉస్మానియా యూనివర్సిటీ బీఈడీ ప్రోగ్రామ్' అనే అంశంపై థీసిస్‌ను సమర్పించారు. ఆమెను పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ అభినందించారు.

పాస్టర్లకు దుస్తులు అందజేత


పాస్టర్లకు దుస్తులు అందజేస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: క్రిస్మస్ పండగను పురస్కరించుకొని ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పాస్టర్లకు గురువారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రిస్మస్ పండుగను ఆనందంగా నిర్వహిచుకోవాలన్నారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, పోశెట్టి గౌడ్, గుడ్ల శ్రీనివాస్, మోజెస్, పాస్టర్‌లు రాజు, సురేష్, సత్యరాజ్, గోపి, శామ్యూల్, నాగభూషణం, సుమన్, జాషువా తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్


నల్లగండ్ల హుడా కాలనీలోని అబోడ్ ఆహ్లాదం అపార్టుమెంట్ సమీపంలో ..

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్ల హుడా కాలనీలో మ్యాన్‌హోల్ ధ్వంసం కావడంతో స్థానికులు ఇబ్బందిపడుతున్నారు. కాలనీలోని అబోడ్ ఆహ్లాదం అపార్టుమెంట్ సమీపంలో మ్యాన్‌హోల్ ధ్వంసం అయి నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేయకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కాలనీ వాసులు భయపడుతున్నారు. ఈ మ్యాన్‌హోల్ వాహనదారులకు దగ్గరకు వచ్చేవరకు కనిపించకపోవడంతో స్థానికులు ఆ ప్రాంతంలో కర్రలు ఏర్పాటు చేశారు. జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు మ్యాన్‌హోల్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఆరుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఆరుగురిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా ఐదు మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు, మరొకరికి రూ. వెయ్యి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి ఆదిత్యగార్డెన్‌లోని పాండురంగ హెవెన్ అపార్ట్‌మెంట్‌లో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ, జీసస్ జననం దృశ్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అపార్ట్‌మెంట్‌వాసులు కేక్ కట్ చేశారు.

వర్షపు నీరు నిలవకుండా చూడాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్, జ్యోతినగర్ పరిధిలో జరుగుతున్న ఓపెన్ డ్రైన్ పనులను గురువారం కార్పొరేటర్ పుష్పనగేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓపెన్ డ్రైన్ వేసిన ప్రాంతంలో సీసీ రోడ్డు వేస్తామని తెలిపారు. కాలనీలలో వర్షపునీరు నిలువకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఫిల్మ్, ఎంటర్‌టైన్‌మెంట్ పరిశ్రమలో

విజయం సాధించాలంటే నైపుణ్యం అవసరం

టీహబ్ సీఈఓ సుజిత్ జాగిర్దార్

రాయదుర్గం: ఫిల్మ్, ఎంటర్‌టైన్‌మెంట్ పరిశ్రమలో విజయం సాధించాలంటే నైపుణ్యం ఎంతో ముఖ్యమని టీహబ్ సీఈఓ సుజిత్ జాగిర్దార్ పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ హబ్‌లో ఫిల్మ్ ఎడ్యుకేషన్‌లో అగ్రగామి 'మీ స్కూల్' ద్వారా సినీప్రెన్యూర్ ప్రోగ్రామ్ కోహర్ట్-5ను ప్రారంభించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మీ స్కూల్ సృజనాత్మకతను పెంపొందించడంలో ముందంజలో ఉందన్నారు. సినీప్రెన్యూర్ ప్రోగ్రామ్ వారి అంకితభావానికి నిదర్శనమన్నారు. మీ స్కూల్' వ్యవస్థాపకులు ప్రతిభ పులిజాల మాట్లాడుతూ క్రియాశీల ప్రతిభను పెంపొందించడంలో, ఆశాజనకమైన చిత్ర నిర్మాతలు, సృజనాత్మక వ్యాపారవేత్తలు వారి కలలను నెరవేర్చడంలో ముందుకుసాగుతున్నామన్నారు డీటీపీ డైరీస్ అనే పాడ్ కాస్ట్ సిరీస్‌ను ప్రవేశపెట్టడం గర్వంగా ఉందన్నారు. కాగా తెలంగాణ రాష్ట్ర తొలి మహిళా సినిమాటోగ్రాఫర్ విజయక్ష డీటీపీ డైరీస్ ప్రారంభ ఎపిసోడ్‌ను హోస్ట్ చేయడం విశేషం, ప్రముఖ సినిమాటోగ్రాఫర్, దర్శకుడు పిజివిందా, మాజీ నిర్మాత పరుశురామ్, టీహబ్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, విద్యార్థులు, టీహబ్, మీస్కూల్ ప్రతినిధులు పాల్గొన్నారు.


టీహబ్‌లో మీ స్కూల్ గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందిస్తున్న సుజిత్‌జాగిర్దార్, స్కూల్ ప్రతినిధులు

మురుగు సమస్యను పరిష్కరించరా..?



మియాపూర్: చందానగర్ డివిజన్‌లోని విశ్వేశ్వర కాలనీలో రోడ్డుపై మురుగు సమస్య నెలకొంది. వీధుల్లో మురుగు పారుతుండడంతో స్థానికులు ఇబ్బందులుపడుతున్నారు. గతంలో మురుగు రోడ్డుపై ప్రవహించడంతో అధికారులు పరిశీలించి రోడ్డు పక్కన గుంతలు తవ్వి అందులో నుండి మరో మ్యాన్‌హోల్‌కు ప్రవహించే విధంగా ఏర్పాటు చేసి వదిలేశారు. 5 నెలల నుంచి సమస్య పరిష్కరించడం లేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసనతో పాటు, దోమలు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా త్వరలోనే పైప్‌లైన్ వేస్తామని చెబుతున్నారే తప్ప పనులు ప్రారంభించడం లేదని ఇవాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అనుమానాస్పదంగా ఉంటే సమాచారం ఇవ్వండి

పటాన్‌చెరు టౌన్: కొత్తగా లేదా అనుమానాస్పదంగా వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ రవీందర్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం చిట్కుల్ వడ్డెర కాలనీలో గురువారం తెల్లవారుజామున 5 గంటలకు ఎనిమిది మంది సీఐలు, 20 మంది ఎస్ఐలు, వందమంది సిబ్బందితో కలిసి నిర్బంద తనిఖీలు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఇంట్లో ఉన్నరి వ్యక్తిగత గుర్తింపు వివరాలు సేకరించారు. 60 ద్విచక్రవాహనాలు, 1 ఆటో, 3 టాటా ఏస్ వాహనాలు, 3 కార్లు స్వాధీనం చేసుకొని వాటి పత్రాలు పరిశీలించారు. పత్రాలు ,బీమా, నంబర్ ప్లేట్లు సక్రమంగా లేని వాహనాలకు ట్రాఫిక్ అధికారులు రూ.63,500 జరిమానా విధించారు. ఆ వాహనాలపై పెండింగ్ చలాన్‌లు రూ.51,300 రికవరీ చేశారు.ఈ సందర్భంగా ఇద్దరు రౌడీ షీటర్లను గుర్తించారు. అనంతరం కాలనీవాసులకు పలు సూచనలిచ్చారు. అపరిచితులకు ఇల్లు అద్దెకు ఇవ్వవద్దని, అద్దెకు ఇచ్చే ముందు వారి ఆధార్ వివరాలు తీసుకున్న తర్వాత ఇవ్వాలన్నారు.ఈ తనిఖీల్లో సీఐ వినాయక్‌రెడ్డి, క్రైమ్ సీఐ రాజు, అమీన్‌పూర్ సీఐ నాగరాజు, బీడీఎల్ సీఐ స్వామిగౌడ్, బొల్లారం సీఐ రవీందర్‌రెడ్డి, జిన్నారం సీఐ నయీముద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

బీహెచ్‌ఈఎల్‌లో ఉద్యోగభర్తీలు చేపట్టాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ పరిశ్రమలో ఉద్యోగ భర్తీలను చేపట్టాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం భెల్ పరిశ్రమ గేట్ ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా భెల్ సీఐటీయూ అధ్యక్షులు పెంటయ్య మాట్లాడుతూ పరిశ్రమలో కొత్తగా నియామకాలు చేయలేదన్నారు. ఉన్న వారు రిటైర్ అవుతుండడంతో కార్మికుల సంఖ్య తగ్గుతుందన్నారు. నియామకాలు చేపట్టకపోతే రానున్న రోజుల్లో ప్రభుత్వ రంగ పరిశ్రమలు మూతపడే అవకాశం ఉందన్నారు. పరిశ్రమ అభివృద్ధి చెందాలంటే కార్మికులు కీలకమని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, నాగులు, బాషా, కుమారస్వామి, సతీష్, లింగరాజు,ప్రభాకర్ , నాగన్న, వీరన్నలు పాల్గొన్నారు.


భెల్ పరిశ్రమ గేట్ ముందు ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

విజేతలకు బహుమతులు అందజేత


విజేతలకు బహుమతులు అందజేసిన విజయ్‌కుమార్

చందానగర్ : చందానగర్ పీజేఆర్ స్టేడియంలో ఆక్స్‌ఫర్డ్ స్కూల్ క్రీడా దినోత్సవంను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్ హాజరై మాట్లాడుతూ పాఠశాలలు విద్యార్థులకు క్రీడా సౌకర్యాలు కల్పించాలని, వారు మరింతగా రాణించే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ఆయన విజేతలకు బహుమతులు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాలల రీజినల్ ఇంచార్జి ఆరోగ్యరెడ్డి, ప్రిన్సిపల్ మాలిన్ బీ, ప్రశాంతి, నస్రీన్, స్వాతి, మేరి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్ రోడ్డును బాగు చేయండి

పటాన్‌చెరు: జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, అలాగే అమీన్‌పూర్ రోడ్డు మరింత దారుణంగా ఉందని ప్రొఫెసర్ కోదండరాం శాసనమండలిలో ప్రస్తావించారు.ఆ రోడ్లను బాగు చేయాలని ఆయన విన్నవించారు. లింగంపల్లి వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం కారణంగా జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఆ రోడ్డుకు అనుసంధానంగా ఉన్న అమీన్‌పూర్ రోడ్డుపై ప్రజలు నరకయాతన పడుతున్నారని ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ఎప్పుడు పూర్తవుతాయని ఆయన ప్రశ్నించారు.

నేడు భవిష్యనిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కార్యాలయం ఆధ్వర్యంలో భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పిఎఫ్ కమిషనర్ డాక్టర్ హేమంత్ తెలిపారు. ఈ నెల 27న ప్రశాంత్‌నగర్‌లోని ఆర్‌టీసీ బస్ టెర్మినల్‌లోని రెండవ అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో, సర్దార్‌పటేల్‌నగర్‌లో స్పైస్ ఫెసిలిటీస్ ప్రైవేట్ లిమిటెడ్ మంజు రెసిడెన్సీలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారని అన్నారు. ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలిపారు. కూకట్‌పల్లి, జీడిమెట్ల, సనత్‌నగర్, బీహెచ్‌ఇఎల్, తదితర ఖాతాదారులు పాల్గొనాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



రామచంద్రాపురం(పటాన్‌చెరు): సీఎంఆర్‌ఎఫ్ పేదలకు ఎంతో ఉపయోగపడుతుందని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి అన్నారు. గురువారం రామచంద్రాపురంలో భారతీనగర్ డివిజన్‌కు చెందిన రాజేష్ రెడ్డికి మంజూరైన చెక్కును అందించారు.

దిష్టిబొమ్మ దహనం.. కాంగ్రెస్ నిరసన


నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు జగదీశ్వర్‌గౌడ్, జైపాల్ తదితరులు

చందానగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు నిరసనగా గురువారం చందానగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్, ఎంబీసీ చైర్మన్ జెరిపేటి జైపాల్, నాయకులు, కార్యకర్తలు కలిసి అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమిత్ షా వ్యాఖ్యలు దళిత, గిరిజన, బీసీ, మైనార్టీల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. అమిత్ షా వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సయ్యద్ గౌస్, సాంబశివరావు, ఆలీ, కట్ల శేఖర్‌రెడ్డి, రాజు, సూరి రాథోడ్, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షులు మధు, రాజేష్, రాము గౌడ్, అక్బర్ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు


నల్లగండ్ల హుడా కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తదితరులు

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్ల హుడా కాలనీలో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి గురువారం పర్యటించారు. కాలనీవాసులు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకవచ్చారు. ఈ సందర్భంగా గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ హుడా కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. డ్రైనేజీ ఓవర్‌ఫ్లో, డ్రైనేజీ లైన్లను ప్రణాళిక బద్ధంగా ఏర్పాటు చేయాలని జలమండలి అధికారులకు సూచించారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ల డయా పెంచడంతో పాటు లెవల్స్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు జలేంధర్ రెడ్డి, అసోసియేషన్ నాయకులు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ గ్రంథాలయాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం


గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న చైర్మన్

పటాన్‌చెరు టౌన్: జిల్లాలోని అన్ని గ్రంథాలయాలను మోడల్ గ్రంథాలయాలుగా తీర్చిదిద్దడం లక్ష్యమని జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ అంజయ్య అన్నారు. గురువారం పటాన్‌చెరు గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. గ్రంథాలయంలోని పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో ఏర్పాటు చేసిన బుక్ ఫెయిర్ డిసెంబర్ 19 నుండి జనవరి 29 వరకు నిర్వహిస్తారని, ప్రజలు తప్పనిసరిగా బుక్‌ఫెయిర్‌ను సందర్శించాలని సూచించారు. సంగారెడ్డి జిల్లాలోని గ్రంథాలయాలను మంత్రి దామోదర రాజనర్సింహ సహకారంతో అభివృద్ధి చేస్తామన్నారు. జిల్లాలో మొత్తం 20 లైబ్రరీలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.రాయికోడ్ రూ. 50 లక్షలు, నారాయణఖేడ్ ఫస్ట్ ఫ్లోర్ రూ .60 లక్షలు, ఆందోల్ ఫస్ట్ ఫ్లోర్ రూ .60 లక్షలతో గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

క్రిస్మస్.. అనాథలకు విందు



మాదాపూర్: క్రిస్మస్‌ను పురస్కరించుకుని మాదాపూర్‌లోని ఆవాస హోటల్‌లో గురువారం జీవోదయ హోమ్‌కు చెందిన 50 మంది అనాథ పిల్లలకు ప్రముఖ ఎన్జీవో డాక్టర్ నిర్మల ఆధ్వర్యంలో విందు ఏర్పాటు చేశారు.అనంతరం చిన్నారులు సరదాగా ఆడుకున్నారు. కార్యక్రమంలో బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి, ఆవాస హోటల్ జీఎం గురు, హోటల్ సిబ్బంది పాల్గొన్నారు.

నయనానందకరం..



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ హస్తకళా మేళాలో భాగంగా గురువారం ఫిలడెల్ఫియా, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా నుంచి వచ్చిన కూచిపూడి నర్తకి స్నేహ ఇంద్రగంటి తన నృత్యప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. రాధికాకృష్ణ, అష్టపది, నీలమేఘ శరీర తరంగం అంశాలను ప్రదర్శించారు. అలాగే కేరళకు చెందిన హేతి గ్రూప్ కళాకారులు శివగంగ, మనీషా, గోపిక, శ్రీలక్ష్మి, మేఘ తదితరులు అష్ట అయ్యప్ప అవతారం, శ్రీ శబరి గిరినాదం, ఆనందభైరవి ప్రదర్శనలు నయనానందకరంగా సాగాయి.

